నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | సెప్టెంబర్ 03, 2024 | www.navatelangana.com



## విద్యాసంస్థలకు సెలవు పొడిగింపు

- నేడు సైతం సెలవు ప్రకటిస్తూ కలెక్టర్‌ల ఆదేశాలు జారీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు వరుసగా ఈ నెల 3వ తేదీన సెలవును ప్రకటిస్తున్నట్లు ఇరు జిల్లాల కలెక్టర్‌లు సోమవారం తెలిపారు. అన్ని విద్యా సంస్థలు సెలవు పాటించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతో విద్యా సంస్థలకు మంగళవారం సైతం సెలవు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

## పిడుగుపాటుకు పశువుల కాపరి మృతి



చిమ్య నాయక్


నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలంలోని బొప్పాస్ పల్లి గ్రామానికి చెందిన చిమ్య నాయక్ (55) పిడుగుపాటుకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం చిమ్య నాయక్ పశువులను మేపటానికి అడవుల్లోకి వెళ్ళగా భారీ వర్షం ఏకధాటిగా కురియడం తోపాటు పిడుగు పాటుకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో వెంటనే వెళ్లిన అంబులెన్స్ సిబ్బంది ప్రథమ చికిత్స అందించి బాన్సువాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నేడు మధ్యాహ్నం చికిత్స పొందుతూ చిమ్య నాయక్ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాన్సువాడ డివిజన్ పరిధిలో పిడుగుపాటుకు ఇప్పటికే ఇద్దరు మృతి చెందారు. ఇందులో ఇద్దరు నసురుల్లాబాద్ మండలానికి చెందినవారే ఒకరు నాచుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థిని శ్వేత మరో బొప్పాస్ పల్లి గ్రామానికి చెందిన పశువుల కాపరి చిమ్యా నాయక్ మృతి చెందారు. చిమ్య నాయక్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నసురుల్లాబాద్ పోలీసులు తెలిపారు.

# ఎస్సారెస్పీ గేట్లు ఎత్తివేత



- వరద పోటెత్తడంతో 41 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- ప్రాజెక్టు 2.5 లక్షల పైచిలుకు ఇన్‌ఫ్లో



నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మంజీరా, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీకి వరదనీరు పోటెత్తుతుంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి గంట గంటకూ ప్రవాహం పెరుగుతూ వచ్చింది. దీంతో మొత్తం 41 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 2.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. 41 గేట్ల ద్వారా 3.14 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

అర్ధరాత్రి 12 గంటల సమయంలో 98 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా.. క్రమంగా గంటగంటకూ ప్రవాహం పెరిగింది. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఇన్‌ఫ్లో 1.95 లక్షలకు చేరగా.. 8 గేట్లు ఎత్తి 25 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రవాహం అదే విధంగా కొనసాగుతుండటంతో ప్రాజెక్టు నీటిమత్తం పెరగడంతో 12.30 గంటల సమయంలో మొత్తం 40 గేట్లు ఎత్తి లక్ష 50 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. రాత్రి 9 గంటల సమయంలో ఇన్‌ఫ్లో 2.51 లక్షల క్యూసెక్కులకు చేరడంతో దిగువకు మొత్తం 41 గేట్లు ఎత్తి 3.14 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అదే విధంగా వరద కాలువకు 7000 క్యూసెక్కులు, కాలువలకు 8000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

విద్యుత్ ఉత్పత్తి కోసం ఎస్కేప్ గేట్ల ద్వారా 4000 క్యూసెక్కుల నీరు గోదావరి లోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు, 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1088.9 అడుగులు 72.990 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.




## నిజాంసాగర్‌కు 51 వేల ఇన్‌ఫ్లో

**నిజాంసాగర్ :** నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకి సోమవారం సాయంత్రం ఏడు గంటల వరకు ప్రాజెక్టులోకి 51200 క్యూసెక్కుల భారీ ఇన్ ఫ్లో వచ్చి చేరుతుందని ప్రాజెక్ట్ ఏఈఈ శివ తెలిపారు. వరద ప్రవాహం ఇంకా పెరిగే అవకాశం ఉంది అని ఆయన అన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 9.524 టీఎంసీల నీరు నిల్వలో ఉంది అని ఆయన అన్నారు. వర్ష భావంతో వాగులు, వంకలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలందరూ కూడా అప్రమత్తంగా ఉండాలని కాల్వలలో, చెరువులలో ఎవరు కూడా దిగవద్దని ఆయన హెచ్చరించారు.

## పోచారం ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో

**నాగిరెడ్డిపేట్ :** నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రాజెక్టుకు భారీ ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇరిగేషన్ డి ఈ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో గత మూడు రోజులుగా భారీగా వర్షం కురవడంతో సోమవారం రోజు 27 వేల క్యూసెక్కుల వరద నీరు పోచారంలోకి వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదే స్థాయిలో 27 వేల క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుండి పొంగిపోతున్నట్లు ఆయన తెలిపారు. పోచారం నుండి పొంగిపొర్లిన నీళ్లన్నీ నిజాంసాగర్ ప్రాజెక్టులోకి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు.



## చేతికందే వేళ..

- పంటలకు తీవ్ర నష్టం
- భారీ వర్షాలకు నేలకొరిగిన మొక్కజొన్న

నవతెలంగాణ-పెద్దకోడప్‌గల్

మండలంలో రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని బేగంపూర్ గ్రామ శివారులో మొక్క జొన్న పంట నెలమట్టం అయింది.పంట చేతికి వచ్చే సమయంలో కురుస్తున్న భారీ వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. రైతులు అప్పొ సప్పొ చేసి పంట పండిస్తే చేతికి వచ్చేసమయంలో తమకు నష్టాలు మిగిలి అప్పుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారుఅధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

**నీట మునిగిన సోయా పంట**

**బోధన్ :** బోధన్ మండలం హంగర్ గ్రామ శివారులో ఎస్ఆర్ఎస్పీ వరద నీటితో వందల ఎకరాల్లో సోయా పంట నీట మునిగింది.నీట మునిగిన సోయా పంటతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

**నీట మునిగిన పంట పొలాలు**

**బాల్కొండ :** గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామం నుంచి బస్సాపూర్ వెళ్లే దారిలో పంట పొలాలు నీట మునిగాయి.



పెద్దకోడప్‌గల్: నేలకొరిగిన మొక్క జొన్న పంట



బాల్కొండ: నీట మునిగిన పొలాలు

## నీటమునిగిన 'డబుల్' ఇండ్లు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పునరావాస కేంద్రాలకు పలువురి తరలింపు
- పురాతన ఇండ్లల్లోని వారు సైతం తరలింపు

నవతెలంగాణ-భిక్కనూర్

భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల ఇండ్లల్లోకి నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమై.. బాధిత కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. భిక్కనూర్ మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో డబుల్ ఇండ్లు నీటమునిగాయి. దీంతో బాధిత కుటుంబాలను అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక పునరావాల శిబిరానికి తరలించారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులతో కలిసి పరిశీలించారు. బాధితులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆహారం అందించాలని, పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలని, ఇతర సౌకర్యాలని పక్కాగా ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కాగా డబుల్ ఇండ్లకు నీరు రాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, గ్రామ ప్రజా ప్రతినిధులు, ప్రజలు కోరారు.

ఎన్‌హెచ్ హైవేను పరిశీలించిన గుంతలు పూడ్చాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ తో ఫోన్లో మాట్లాడి ఆదేశించారు.



నీటమునిగిన డబుల్ ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

**పునరావాస కేంద్రాలకు తరలింపు**

**ఆర్మూర్ :** ఖానాపూర్, కోమన్‌పల్లి గ్రామాల్లో శిథిలావస్థలో ఇళ్ల లో వున్న నాలుగు కుటుంబాలను పునరావాస కేంద్రాలకు (పాఠశాలలకు) తరలించినట్టు స్పెషల్ ఆఫీసర్ రాజా గంగారాం సోమవారం తెలిపారు.

**జక్రాన్‌పల్లి :** మండలంలోని బాల్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఎక్కువ శాతం గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబ సభ్యుల్ని పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రానికి తరలించారు. జీపీ ట్రాక్టర్ ద్వారా తరలించి వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. వారితో డిచ్‌పల్లి సిఐ మల్లేష్ తహసీల్దార్ కిరణ్ మై ఎంపీడీవో సతీష్ కుమార్ ఎస్సై తిరుపతి గుడిసెలో నివసిస్తున్న వారితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.

## ప్రాజెక్టు పరివాహక ప్రాంతాలవారిని అప్రమత్తం చేయండి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- కాజ్‌వేలను మూసివేయాలి : కామారెడ్డి కలెక్టర్

నవతెలంగాణ-బాల్కొండ/కామారెడ్డి/నాగిరెడ్డిపేట్

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టును సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సందర్శించారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న వరదను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టు గేట్లను ఆపరేట్ చేయాలని తెలిపారు. ప్రాజెక్టు పరివాహక ప్రాంతాలను అప్రమత్తం చేయాలని సూచించారు. ఆయనవెంట సీపీ కల్మేశ్వర్, శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ ఎస్ఈ శ్రీనివాస్ రావు గుప్తా, ఈ ఈ చక్రపాణి, ఏఈఈ వంశీ తదితరులు పాల్గొన్నారు.

**కాజ్‌వే మూసివేయాలి : జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్**

**కామారెడ్డి :** వరద తగ్గేవరకు భవానిపేట్ - పోతారం గ్రామాల మధ్య కాజ్ వే ము మూసివేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. పాల్వంచ మండలంలోని కాజ్వే నుండి ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. కాజ్ వేకు ఇరువైపులా బారికేడింగ్ చేసి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని తాసిల్దార్ జయంత్ రెడ్డిని ఆదేశించారు.



బాల్కొండ: ఎస్సారెస్పిని పరిశీలిస్తున్న కలెక్టర్

**తుఫాను తగ్గేవరకు అప్రమత్తత : ఎస్పీ సింధుశర్మ**

**నాగిరెడ్డిపేట్ :** తుఫాను ప్రభావం తగ్గేంతవరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ పిలుపునిచ్చారు. సోమవారం రోజు ఉధృతంగా పొంగుతున్న పోచారం ప్రాజెక్టును సందర్శించారు. ఆమె వెంట ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాసులు, సీఐ రవీందర్ నాయక్, ఎస్ఐ మల్లారెడ్డి ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్, డి ఈ ఈ వెంకటేశ్వర్లు ఉన్నారు.

# పోటెత్తిన వరద

- మంజీరా, గోదావరి ఉగ్రరూపం
- పొంగిపొర్లుతున్న కాలువలు
- పలుగ్రామాలకు రాకపోకలు బంద్
- పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్న అధికార యంత్రాంగం

నవతెలంగాణ-విలేకరులబృందం

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నదులకు, కాలువలకు వరద నీరు పోటెత్తుతుంది. అటు మంజీరాకు ఇటు గోదావరి నదులకు వరద తాకిడి పెరిగింది. దీంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సాలూర వద్ద మంజీరా నది రాతివంతెనను తాకుతూ ప్రవహిస్తూ రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరిలో కలుస్తుంది. అటు మహారాష్ట్ర నుంచి సైతం గోదావరికి వరద పోటెత్తుతూ వస్తుండటంతో దానికి మంజీరా తోడు కావడంతో కందకుర్తి వద్ద గోదావరి నది బ్రిడ్జిని తాకేలా ప్రవహిస్తుంది. ఎస్సారెస్పీకి 2.5 లక్షల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. అదే విధంగా కాలువలకు వరద తాకిడితో పొంగిపొర్లుతున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**త్రివేణి సంగమంలో నిండుగా ప్రవహిస్తున్న గోదావరి..**

**రెంజల్ :** రెంజల్ మండలం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో వరద నీరు రావడంతో జలకళ సంతరించుకుంది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మహారాష్ట్రలోని విష్ణుపురి, భోలేగావ్, గేట్లు ఎత్తివేయడంతో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కందకుర్తి గోదావరి బ్రిడ్జికి దగ్గరగా నీరు ప్రవహిస్తూ ఉండడంతో, కందకుర్తి గోదావరి లని రాతి శివాలయం పూర్తిగా మునిగిపోయింది. కల్వకుర్తి గోదావరి త్రివేణి సంగమాన్ని తాసిల్దార్ శ్రవణ్ కుమార్, ఎంపీడీవో హెచ్ శ్రీనివాస్, రెంజల్ ఎస్ఐ ఈ సాయన్న సంఘటన స్థలానికి వెళ్లి ప్రజలను అప్రమత్తం చేశారు. కందకుర్తి గ్రామ ప్రజలు కానీ, సందర్శకులు గానీ గోదావరి తీరంలోకి రాకూడదని వారు చాటింపు వేయించారు. వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు సందేశాలు పంపారు.

**ఉధృతంగా ప్రవహిస్తున్న మంజీర..**

**బోధన్ :** సాలూర మండలం సమీపంలోని మంజీర నది ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో నిండుగా మారి ఉధృతంగా ప్రవహిస్తుంది. పురాతన రాతి వంతెనకు సమానంగా నీటి ప్రవాహం కొనసాగుతుంది. సెంట్రల్ వాటర్ కమిషన్ శాఖ జూనియర్ ఇంజనీర్ జవహర్ లాల్, మంజీర సబ్ డివిజన్ ఇంజనీర్ సతీష్ మంజీర నది నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. 48342.739 నీటి ప్రవాహం ఉందని, 6.6 మీటర్ల ఎత్తున నీరు ఉందని వారు తెలిపారు. అలాగే సాలూరలో 44.08 వర్షపాతం నమోదయినట్లు వారు తెలిపారు. మంజీర నీటిని తిలకించేందుకు స్థానికులు తరలివస్తున్నారు. దాంతో బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి పోలీసు సిబ్బందిని ఏర్పాటుచేసి పర్యాటకులను నియంత్రిస్తున్నారు. మహారాష్ట్ర ఏస్గి వైపు అక్కడి పోలీసులు రాతి వంతెనపై జనం రాకుండా కందకం తవ్వారు.



బోధన్: సాలూర వద్ద రాతివంతెనను తాకుతూ ప్రవహిస్తున్న మంజీరా

**మద్నూర్ :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ నుండి పారే లెండి వాగుకు వరద నీరు జోరుగా రావడం ఉప్పొంగి ప్రవహిస్తుంది. ఈ లెండి వాగు మండల కేంద్రానికి మండలంలోని గోజేగావ్ గ్రామానికి మధ్యలో ఉంది వాగు పైన హై లెవెల్ బ్రిడ్జి లేకపోవడం లో ఓవర్ బ్రిడ్జ్ ఉన్నందున వరద నీరు ఉప్పొంగి పారుతున్న నేపథ్యంలో రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ ఎండి ముజీబ్ వాగును సందర్శించి వరద నీటిని పరిశీలించారు. ఎంపీడీవో రాణి ఎస్సై విజయ్ కొండా ఆర్ఐ శంకర్ తదితరులు పొంగిపొర్లుతున్న లేండి వాగును పరిశీలిస్తూ ఈ దారి గుండా ఎవరు రాకుండా ముందు జాగ్రత్తగా ముళ్ళ కంపలు వేస్తూ దారులు మూసివేశారు. గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఎలాంటి సమస్య వచ్చినా ఆ గ్రామ ప్రజలు మహారాష్ట్ర ప్రభుత్వంతోనే పనులు జరుపుకోవాలని ఉంటుంది ప్రస్తుతం ఆ గ్రామానికి అధికారులు వెళ్లాలన్నా మహారాష్ట్ర ప్రాంతం నుండి దాదాపు 40 కిలోమీటర్లు తిరిగి వెళ్ళవలసి ఉంటుంది.



మద్నూర్: లెండి వాగును ఉధృతతో రాకపోకలు బంద్



కందకుర్తి బ్రిడ్జికి దగ్గరగా ప్రవహిస్తున్న నీరు



తెగిన బీటీ రోడ్డు

**కొనసముందర్, అమీర్ నగర్ గ్రామాల మధ్య రాకపోకల నిలిపివేత**

**కమ్మర్‌పల్లి :** మండలంలోని కొన సముందర్, అమీ నగర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి రెండు గ్రామాల మధ్య బిటి రోడ్డు కోతకు గురైంది. రాత్రి కురిసిన భారీ వర్షానికి సమీపంలోని చెరువు పోటెత్తడంతో వరద ప్రవాహ తాకిడికి బీటీ రోడ్డు పెద్ద ఎత్తున కొత్త గురైంది. దీంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇరువైపులా ప్రజలు ఎవ్వరు ఈ దారి కుండా ప్రయాణించకుండా గ్రామ పంచాయితీ ట్రాక్టర్లను అడ్డం పెట్టారు.బీటి రోడ్డు పక్కన గల పంట పొలాల్లోకి కూడా పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరింది. దీంతో పంట పొలాల్లో ఇసుక, మట్టి మెటలు వేసాయి. గత సంవత్సరం కూడా ఇదే ప్రాంతంలో రోడ్డు కోతకు గురైంది. ప్రతి సంవత్సరం భారీ వర్షాలు కురిస్తే రోడ్డు తెగిపోవడం ఒక ఆనవాయి తీగా మారింది. అధికారులు ఇలాంటి సమస్య భవిష్యత్తులో మళ్లీ పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టి స్లాబ్ కల్వర్టు నిర్మాణంచేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాగా కోతకు గురైన రోడ్డును రెవిన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు సందర్శించి పరిశీలించారు.

**రోడ్డుకు బుంగ..**

కమ్మర్‌పల్లి మండలంలోని కోనాపూర్ నుండి కొత్త చెరువు తండా వెళ్లే దారిలో రోడ్డుకి బుంగ పడింది.అటు వైపు ప్రజలు ఎవరు వెళ్లకుండా రాళ్ళు, ముళ్ళకంప అడ్డుపెట్టారు. రోడ్డుకు బుంగపడ్డ ప్రదేశంలో గ్రామ పంచాయతీ సిబ్బంది కాపలాగా ఉన్నారు. దీంతో ఈ దారి గుండా ప్రయాణించేందుకు ప్రజలు జంకుతున్నారు. వర్షం ఇలాగే కొనసాగితే రోడ్డు పూర్తిగా కోతకు గురయ్యే ఆస్కారం ఉందని ఇరు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వస్తున్న వరస వరదల మూలంగా రోడ్లు, కల్వర్టు ధ్వంసం అవుతున్నాయి. రోడ్లు కోతకు గురై ధ్వంసం అవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడికక్కడ రాకపోకలు స్తంభిస్తున్నాయి.

## నీట మునిగిన ఉమామహేశ్వర ఆలయం

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజక వర్గంలోని నందిపేట్ మండలంలోని ఉమామహేశ్వర ఆలయం సోమవారం గోదావరి ఉధృతికి శివాలయం గంగమ్మ ఒ డీకి వెళ్ళిపోయింది. ప్రతి సంవత్సరం శివరాత్రి రోజు మళ్ళీ భక్తులకు దర్శనానికి వెళ్తుంటారు. శివరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమం సైతం నిర్వహిస్తారు.


నీటమునిగిన ఆలయం

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 28 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు, డీడబ్ల్యూ. రసూల్ బీ, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడండి

- రాష్ట్ర విత్తన అభివృద్ధి శాఖ చైర్మన్ అన్వేష్ రెడ్డి


ఏఈవోతో మాట్లాడుతున్న రాష్ట్ర విత్తన అభివృద్ధి శాఖ చైర్మన్

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి శాఖ చైర్మన్ అన్వేష్ రెడ్డి రెంజర్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రెంజర్ల గ్రామంలోని రైతు వేదికలో రైతుల రుణమాఫీలో ఉన్న లోపాలను ఏఈవో నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కుటుంబ నిర్ధారణ పనులు పూర్తి చేయాలని సూచించారు. అంతకుముందు ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ ఖేత్ అధ్యక్షుడు బద్దం సాగర్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ ఉపాధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డి, రైతు నాయకులు బుల్లెట్ రాంరెడ్డి పాల్గొన్నారు.

## చెరువుల పరిశీలన


చెరువులను పరిశీలించిన్న అధికారులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంతో పాటు మండలంలోని నాగంపేట్ గ్రామంలోని చెరువులను మండల ప్రత్యేకాధికారి స్రవంతి సోమవారం మండల పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించారు. రెండు, మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు అందుబాటులో ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహ్మద్ ముజఫరొద్దీన్, ఎంపీవో మహమ్మద్ గౌస్, నాగంపేట్ సెక్రటరీ గౌతమి, ముప్కాల్ గ్రామ పంచాయతీ కారొబార్ తాహెర్, పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వరదల వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించిన అన్వేష్ రెడ్డి


మాట్లాడుతున్న చైర్మన్ అన్వేష్ రెడ్డి

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్, దోంచంద, గుమ్మిర్యాల్ గ్రామాల్లో సోమవారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్ రెడ్డి పర్యటించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించి, వివరాలను అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని అన్నారు. సంవత్సరం క్రితం గుమ్మిర్యాల్ నుండి కొండాపూర్ వెళ్ళే బ్రిడ్జి పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో దానిని పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయిస్తానని తెలిపారు. ఎస్ఆర్ఎస్పీ నుండి నీళ్ళు వదిలారు కావున గోదావరి నదీ పరివాహక ప్రాంత రైతులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడేం గంగాప్రసాద్, కిసాన్ ఖేత్ మండలాధ్యక్షులు ముస్కు మోహన్ రెడ్డి, డీసీసీ డెలిగేట్ గడ్డం జీవన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన



వినాయకుల బావిని పరిశీలిస్తున్న కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ సోమవారం నగరంలో పర్యటించారు. వినాయక చవితి సందర్భంగా గూపన్ పల్లి, ఎల్లమ్మ గుట్ట, వినాయకుల బావి వద్ద గల పరిస్థితులను పరిశీలించారు. అక్కడ ఏమి కావాలో సంబంధిత సిబ్బందికి చెప్పి ఏర్పాట్లకు సిద్ధం చేయాలని సూచించారు. ఎక్కడికక్కడ శుభపరిచి ప్రజలకు అందుబాటులో ఉపయోగపడే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సేవలు మరువలేనివి

- కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

దివాంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివని, రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా రైతులందరికీ వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇచ్చారని, రుణమాఫీ చేశారని, విద్యార్థుల కోసం ఫీస్ రీయింబర్స్ మెంట్ చేశారని ఆయన అన్నారు. పేదల కోసం ఆరోగ్య శ్రీ పథకం అందించారని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఎస్ఆర్ మార్గంలో రైతులకు రుణమాఫీ చేశారని ప్రజలకు సేవ చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణు రాజ్, రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ ఉపాధ్యక్షులు విపుల్ గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సంతోష్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రీతం, సుభాష్ జాదవ్, సాయిలు, లవంగ ప్రమోద్, స్వామి గౌడ్,సాయి కుమార్, కేశ రాజు, సృజన్, తదితరులు పాల్గొన్నారు.

**ముప్కాల్:** మండల కేంద్రంతోపాటు మండలంలోని వేంపల్లి, వెంచిర్యాల, కొత్తపల్లి, నల్లూర్, నాగంపేట్ గ్రామాల్లో వైయస్సార్ 15వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రెంజర్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర విత్తన అభివృద్ధి శాఖ చైర్మన్ అన్వేష్ రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యం రెడ్డి, డీసీసీ డెలిగేట్ ఉపా ధ్యక్షులు గడ్డం చిన్నారెడ్డి, బుల్లెట్ రాంరెడ్డి, ఎన్.గంగారాం, మహేష్ యాదవ్, జక్కు గంగాధర్, రాజ్ కుమార్, దనేష్ యాదవ్, ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు పాల్గొన్నారు.


కంఠేశ్వర్: వైఎస్ఆర్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


ముప్కాల్‌లో..

**ఆర్మూర్:** మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలో అయన ఫొటోకి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పిసిసి సెక్రెటరీ బాబా ఖాన్, ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్ పట్టణ అధ్యక్షులు సాయిబాబ గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ పాలనను ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, వ్యవసయానికి ఉచిత కరెంటు, ఫీజు రీయింబర్స్ మెంట్, ఆరోగ్య శ్రీ, 108, జలయజ్ఞం వంటి పథకాలు ప్రజలకు లబ్ధిచేస్తాయని అన్నారు. నియోజకవర్గంలో గుత్ప ఎత్తిపోతల పథకంతోపాటు పదికి పైగా లిఫ్టల ద్వారా సస్యశ్యామలం చేశారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అజ్జు, పట్టణ ఉపాధ్యక్షులు మీసాల రవి, బట్టు శంకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పాషా, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు బాల కిషన్, చిక్కు, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో..

# కలెక్టర్ కండ్లకు గంతలు కట్టి టెండర్లా?

- జీజీహెచ్ అధికారుల తీరుపై ఎంఎస్‌పీ నాయకుల మండిపాటు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి డైట్ టెండర్ల నిర్వహణ ప్రక్రియలో జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు కళ్ళకు గంతలు కట్టి, టెండర్ ఖరారు ప్రక్రియలో ఆసుపత్రి అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని, అవినీతి దందాకు తెరలేపుతున్నారని ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టిమాదిగ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి ఖమ్మంకు బదిలీపై వెళ్లిన ఏడి సంతోష్‌ను ఏ ప్రాతిపదికన నిజామాబాద్ జీజీహెచ్ డైట్ సప్లై టెండర్ల స్క్రూటీనికి పిలిపించారో అధికారులు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఇంచార్జ్ ఏడీని కాదని ఖమ్మం నుంచి సంతోష్‌ను పిలవడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం నిజామాబాద్ జిల్లా ఆసుపత్రి చైర్మన్, టెండర్ల కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అనుమతి తీసుకుని, ఖమ్మం కలెక్టర్ అనుమతి కోరి, ఓడి ఉత్తర్వులు పొంది ఇక్కడి టెండర్ల స్క్రూటీనిలో పాల్గొనాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇదేమి లేకుండానే కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ల కళ్ళకు గంతలు కట్టి టెండర్ల స్క్రూటీని ప్రక్రియ నిర్వహించడం సిగ్గుచేటని విమర్శించారు. లేదంటే ఇదంతా కలెక్టర్లకు తెలిసే జరిగిందా, తెలిస్తే ఎందుకు ఊరుకున్నారు, నిబంధనలు కలెక్టర్లకు తెలియవా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రస్తుతం డైట్ సప్లై చేస్తున్న వై. శ్రీనివాస్ కాంట్రాక్టును గంగాధర్ అనే వ్యక్తి దొంగ దారిలో నిర్వహిస్తున్నారని, దీనిపై అసలు కాంట్రాక్టర్ అయిన వై. శ్రీనివాస్ కలెక్టర్ కు పిర్యాదు చేశారని, దీనిపై పూర్తి విచారణ చేయాలని పేర్కొన్నారు. 2009 లో వై.శ్రీనివాస్ పేరుతో టెండర్ దక్కించుకుని, ఆ తరువాత డబ్బులు ఎవరి ఖాతాలో వేశారు? వై. శ్రీనివాస్ సంతకాలు ఎవరు పెట్టారు? అసలు కాంట్రాక్టర్ వై. శ్రీనివాస్ లేకుండానే కొన్నేళ్లుగా కాంట్రాక్టు ఎలా పొడగించుకుంటూ వస్తున్నారు? వై.శ్రీనివాస్ కాంట్రాక్టర్ కాస్తా ఎంఎస్ వై. శ్రీనివాస్ డైట్ కాంట్రాక్ట్ కంపెనీగా ఎలా మారింది? అని ప్రశ్నించారు. ఇందులో అధికారుల పాత్ర ఏంటి, అధికారులకు అంతా తెలిసే అక్రమాలు కప్పిపుచ్చారా? ఎంఎస్‌వై. శ్రీనివాస్ డైట్ కాంట్రాక్ట్‌కు చెందిన జి.గంగాధర్ అనే వ్యక్తి టెండర్ పత్రాలను మరోమారు స్క్రూటీని చేయాలని డిమాండ్ చేశారు. గంగాధర్ పత్రాల్లోని డొల్లతనం, అక్రమ బాగోతం బయట పడుతుందనే కారణంతోనే నిజామాబాద్ నుంచి బదిలీపై వెళ్లిన ఏడి సంతోష్‌ను వ్యూహం ప్రకారమే ఖమ్మం నుంచి ఇక్కడికి రప్పించి స్క్రూటీని ప్రక్రియలో గంగాధర్ క్వాలిఫై అయ్యేలా చూశారని ఆరోపించారు. దీని వెనకాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని కొందరు అధికారుల హస్తం ఉందని విమర్శించారు. అందుకే ఈ టెండర్లను రద్దుచేసి, కొత్తగా టెండర్లు పిలవాలని కోరారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండండి

- యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టండి
- భారీ వర్షాలపై కలెక్టర్లకు లేఖ రాసిన ఎంపీ అర్వింద్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలపై నిజామాబాద్, జగిత్యాల జిల్లాల కలెక్టర్లకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ లేఖ రాశారు. లేఖలో జిల్లాలో ఇప్పటికే పనిచోట్ల రోడ్లు తెగిపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ ఆర్అండ్‌బి, పోలీస్, విద్యుత్, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని, ఎక్కడ కూడా ప్రాణ నష్టం జరగకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా 40 గేట్లు తెరిచినందున మత్స్యకారులు, జాలర్లను అప్రమత్తం చేయాలని, నిరాశ్రయులైన లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి కనీస సౌకర్యాలు అందజేయాలని కోరారు. మరోవైపు ప్రజలంతా కూడా జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దని ఆయన కోరారు. వ్యవసాయ మోటర్ల వద్ద రైతులు జాగ్రత్తగా ఉండాలని, గోదావరి పరివాహక గ్రామాల మత్సకారులు, జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే భారతీయ జనతా పార్టీ శ్రేణులు సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

## మున్సిపల్ కార్మికులకు రెయిన్ కోట్స్ ఇవ్వడంలో మున్సిపల్ కార్పొరేషన్ నిర్లక్ష్యం

- బీఎల్‌టియు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ సంవత్సరం మొత్తం మున్సిపల్ కార్మికులు వర్షంలో తడుస్తూనే విధులు నిర్వహిస్తున్నా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు కార్మికులకు రెయిన్‌కోట్స్ ఇవ్వక పోవడం కార్పొరేషన్ బాధ్యతారాహిత్యాన్ని తెలియజేస్తుందని బహుజన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయ్ యూనియన్ (బిఎల్‌టీయూ) నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దండి వెంకట్ విమర్శించారు. గత మే నెల నుండి విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ వర్షాకాలం పూర్తి కావస్తున్నా రెయిన్ కోట్స్ ఇంతవరకు ఇవ్వలేదని మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. మున్సిపల్ కార్మికులకు రెయిన్ కోట్స్ జూన్ నెల మొదటి వారంలోనే ఇవ్వాలని గత మే నెల నుండి విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. మున్సిపల్ కార్మికుల మాదిరిగా అధికారులు ఒక రోజు వర్షంలో తడుస్తూ విధులు నిర్వహిస్తే మున్సిపల్ కార్మికుల బాధలేమిటో తెలుస్తుందని అన్నారు. నాలుగు నెలల నుండి రెయిన్ కోట్స్ ఇవ్వమని వినతిపత్రాలు ఇచ్చిన ప్రతిసారీ మున్సిపల్ కమిషనర్ చేస్తం చూస్తం అంటున్నారేగాని ఇవ్వడంలేన్నారు. మాట్లాడితే టెండర్ వేస్తున్నట్లు చెపుతున్నారు. ఇంకా ఎప్పుడు వర్షాకాలం పోయాక టెండర్ వేసి కార్మికులకు రెయిన్ కోట్స్ ఇస్తారా అని ప్రశ్నించారు.

# అత్యవసరమైతేనే బయటకు రండి

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎడతెరిపి లేకుండా భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రాకండి అని, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దని, నాళాలు, డ్రైనేజీ పొంగుపొర్లుతున్నందున చిన్నారులను, వృద్ధులు బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులంతా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతోపాటు మరో 24 గంటలపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో లోతట్టు ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. నిజామాబాద్ నగరంలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. ఇటువంటి సమయంలో తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉన్నందున జాగ్రత్త తీసుకొని స్వచ్ఛమైన త్రాగు నీరు అందించేల చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు, మునిసిపల్ శాఖకు విజ్ఞప్తి చేశారు. ఈదురు గాలుల వలన చెట్లు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న గృహాల్లో ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలకు దూరంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని, ఏదైనా ప్రమాదం జరిగే విద్యుత్ స్తంభాలు ఉంటే వాటి వద్ద సూచికలు ఏర్పాటు చేయవలసిందిగా కరెంటు డిపార్మెంట్, మునిసిపల్ శాఖకు విజ్ఞప్తి చేశారు. నగర ప్రజలు కూడా విద్యుత్ స్తంబాలు తెగిపడిన విద్యుత్ వైర్లతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విషజ్వరాలు ప్రభాలుతున్న ఈ సమయంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మందుల కొరత, డాక్టర్ కొరత లేకుండా చూడాలని వైద్య అధికారులకు విజ్ఞప్తి చేస్తున్న మునిసిపల్ శానిటేషన్ సిబ్బంది నిల్వ ఉన్న వర్షపు నీటిని %ఈ% కలుషిత నీటి వ్యర్ధలను తొలగించాలని, కాలనీలో దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్ స్ప్రే చేయాలనీ విజ్ఞప్తి చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ సహాయ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. నగర వాసులకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా నా క్యాంపు ఆఫీస్ నెంబర్ 8309038027కు అలాగే జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 08462-220183 వెంటనే సమాచారం ఇవ్వగలని కోరారు.

## రక్షిత మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

- యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధల నాగరాజు

నవతెలంగాణ-ఆర్మూర్

రక్షిత మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని యుఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నాగరాజు అన్నారు. బోధన్ డివిజన్‌లో రుద్రూర్‌లో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం అనుమానాస్పద స్థితిలో హాస్టల్ బాత్రూంలో చనిపోయిన రక్షిత మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. బాత్రూంలో అమ్మాయి ఎలా సూసైడ్ చేసుకుంటుందని, అమ్మాయి సూసైడ్ చేసుకునే ముందే సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయడం లేదని, అమ్మాయి కుటుంబ సభ్యులు రాకముందే అక్కడి నుండి మృతదేహాన్ని హాస్పిటల్ కి తరలించారని ప్రశ్నించారు. స్థానిక పోలీసులు ఆధ్యాపకుల కలిసి లోపాకారి ఒప్పందానికి వచ్చినట్లు మాకు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఈ కేసని లోకల్ పోలీసులకు కాకుండా స్పెషల్ బ్రాంచ్ నుండి కేస్ టేక్ అప్ చేయాలని రక్షిత మృతికి కారకులైన వారు ఎవరైనా సరే ఎంత పెద్ద వారైనా సరే చట్టపరమైన చర్య తీసుకోవాలని, అమ్మాయి కుటుంబానికి 50. లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ డివిజన్ ఉపాధ్యక్షులు అభిషేక్, సాయి, హర్ష కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సోమవారం బాల్కొండ ఎస్ఐ బి.నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కోసం ఆటో ద్వారా గ్రామాల్లో మైక్‌తో చాటింపు చేయించారు. వర్షాల నేపథ్యంలో చెరువులు, వాగులు వద్దకు ప్రజలు వెళ్లవద్దని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులకు, అధికారులకు సంప్రదించాలని తెలిపారు.


గ్రామాల్లో చాటింపు వేయిస్తున్న పోలీసులు

## శాంతియుతంగా పండగలను చేసుకోవాలి

- ఎస్ఐ యాసిర్ అర్ఫాత్



మాట్లాడుతున్న ఎస్ఐ యాసిర్ అర్ఫాత్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజలు శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని నిజామాబాద్ రెండవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ యాసిర్ అర్ఫాత్ తెలిపారు. సోమవారం నగరంలోని రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఈ నెలలో వినాయక చవితి పండగ ఉన్నందున వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న పెద్దలు తమ తమ కాలనీలలో యువతతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలతోపాటు యువత పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
మంగళవారం | సెప్టెంబర్ 03, 2024 | www.navatelangana.com

## మొక్కు చెల్లించుకున్న మాజీ జెడ్పిటిసి


కొబమ్మరికాయలు కొడుతున్న మాజీ జెడ్పిటిసి

**నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్**
మండలంలోని పోచారం ప్రాజెక్టు వద్ద గల గంగమ్మకు నూటొక్కా కొబ్బరికాయ కొట్టి మాజీ జెడ్పిటిసి ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి మొక్కు చెల్లించుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మోతే శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు కృష్ణ, మాజీ ఎంపీటీసీ నారాయణ, మాజీ సర్పంచులు వెంకట్రామిరెడ్డి, శ్రీను, అదేవిధంగా నాయకులు సంతోష్‌గౌడ్, దుర్గారెడ్డి, వంశీగౌడ్ బాబురావు తదితరులున్నారు.

## సబ్ కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్



**నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)**
బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా ఉద్యోగ బాధ్యతలు చెప్పట్టిన సబ్ కలెక్టర్ కొప్పిషెట్టి కిరణ్మయిని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ స్థానిక నాయకులతో కలిసి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజల సేవలకు, అభివృద్ధిలో తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరం ఉంటే తప్ప బయటక ఎవరు రాకూడదని ఆమె సూచించారు. బాన్సువాడ డివిజన్‌లో అధికారులు అప్రమత్తంగా ఉన్నారని ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎజాజ్, బుల్లెట్ రాజు, అలీమొద్దీన్ బాబా, హకీమ్, మోహిని, రఫీక్, పంతులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది..

# ఎవరూ ఆందోళన చెందొద్దు

- భారీ వర్షంలో అధికారుల సిబ్బంది సేవలు అమోఘం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి


కాలువను పరిశీలిస్తున్న ప్రభుత్వ సలహాదారుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

**నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)**
తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని వరద బాధితులకు అండగా ఉండి ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం బాన్సువాడ పట్టణంలో వరద తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాన్ని పోచారం సందర్శించారు. బాన్సువాడ నియోజకవర్గం పరిధిలో నసురుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ తదితర మండలాల్లో ఉన్న అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని.. ఎవరూ అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కామారెడ్డి జిల్లాలో ఊహించని స్థాయిలో వర్షాలు కురిసాయన్నారు. అయితే జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. బాన్సువాడ పట్టణంలో వరద బీభత్సం సృష్టించిందన్నారు. చెరువుల్లో, వాగుల్లో అక్రమ నిర్మాణాలు వరదలకు కారణమయ్యాయన్నారు. పట్టణంలో వరద ప్రవాహానికి అడ్డుగా గత పదేళ్లలో ఎన్నో అక్రమ నిర్మాణాలు వెలిశాయన్నారు. కబ్జాలు, కబ్జా దారుల వివరాలను త్వరలో బయటపెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. గత మూడు రోజులుగా రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బాన్సువాడ పట్టణంలోని పలు కాలనీలలో పర్యటించారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బాన్సువాడ పట్టణ కేంద్రంలోని పలు వార్డులలో పర్యటించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నదులు, వాగులు, చెరువులు, కల్వర్టులు, బ్రిడ్జిల దగ్గరకు వెళ్ళవద్దన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని, కరెంటు స్తంభాలు, వైర్లను ముట్టుకోవద్దన్నారు. చిన్న పిల్లలను ఇంట్లోనే ఉంచండి, బయటకు రానివ్వవద్దన్నారు. రాత్రి పగలు లేకుండా పనిచేస్తున్న విద్యుత్, మున్సిపాలిటీ సిబ్బంది సేవలను కొనియాడారు. సిబ్బందికి అధికారులు సహకరించాలని సూచించారు. వీరి వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)**
బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపక పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ స్వామి తెలిపారు. ఇంగ్లీష్ 3, తెలుగు 1, ఎకనామిక్స్ 1, హిస్టరీ 1, పొలిటికల్ సైన్స్ 1, బోటనీ 1, క్రాప్ ప్రొడక్షన్ 1, మ్యాస్ 1, కంప్యూటర్ సైన్స్ 1, కామర్స్ 1 పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత కోర్సుల్లో పీజీ చేసిన వారు అర్హులని తెలిపారు. ఈ సదావకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## జనం గుండెల్లో వైఎస్సార్

- ఘనంగా వైయస్సార్ వర్ధంతి

**నవతెలంగాణ-నసురుల్లాబాద్**
మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు నస్రుల్లాబాద్ మండలంలో సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వైయస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. వైఎస్సార్ ఓ ప్రభంజనం అన్నారు. రాజశేఖర్‌రెడ్డి నవ్వులో స్వచ్ఛత, పిలుపులో ఆత్మీయతలు ఉంటాయని కొనియాడారు. మాట తప్పని, మడమ తిప్పని గుణంతో వైఎస్ఆర్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. అయితే ఆ జ్ఞాపకాలు నేటికీ ప్రజల హృదయాల్లో చెరిగిపోలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు అయినాల లింగం, మండల కార్యదర్శి శివ ప్రసాద్, సీనియర్ నాయకులు తూము సాయగౌడ్, మాజీ ఎంపిటిసి శంకర్ నాయక్, యూసుఫ్, షకీల్, మద్యల సాయిలు, రసీదు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## రెడ్ల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న పలువురు

**నవతెలంగాణ-సదాశివనగర్**
రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి విద్యా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెడ్ల ఆత్మీయ సమ్మేళనానికి మండలంలోని అన్ని గ్రామాల రెడ్డి సంఘాల నుంచి ఇంటికి ఒకరు తరలివచ్చి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ట్రస్ట్ అధ్యక్షులు నాగర్తి చంద్రరెడ్డి కోరారు. మండలంలోని పలు గ్రామాల్లోని రెడ్డి సంఘాల అధ్యక్షుల, కార్యదర్శులకు, కమిటీ సభ్యులకు ఆహ్వాన పత్రికలను వారికి అందజేశారు. రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి విద్యాపరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న స్కూల్, హాస్టల్, స్కిల్ డెవలప్మెంట్ భవనాల నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై భావితరాల రెడ్ల పిల్లలకు విద్యావకాశాలు మెరుగుపరచడానికి దోహదపడుతుందని ఈ సందర్భంగా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు ఏనుగా సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజకుమార్‌రెడ్డి, ఐక్యవేదిక స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి కరుణాకర్‌రెడ్డి, ఐక్యవేదిక మండల అధ్యక్షులు కొప్పుల గంగారెడ్డి, అంజాల్‌రెడ్డి, లింగారెడ్డి, రామ్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల ఖాళీల భర్తీకి దరఖాస్తులకు ప్రకటన

**నవతెలంగాణ-బోధన్**
బోధన్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని బోధన్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్ డివిజన్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ చౌకధరల దుకాణాలను నడిపేందుకు డీలర్ల నియామకం చేపడుతున్నట్లు తెలిపారు. ఆస్తకి గలవారు తమ దరఖాస్తులను విద్యార్హతలు, కులం ప్రాంతీయ ధృవీకరణ పత్రములు గెజిటెడ్ అధికారిచే అటెస్టేడ్ చేయించి సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఆర్డీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. బోధన్ పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ (ఓ.సీ.మహిళ), నర్సాపూర్‌లో (ఎస్సీ మహిళ), బోధన్ మండలంలోని సిద్దాపూర్‌లో (ఓసీ), బోధన్ అర్బన్‌లో (బీసీ-ఏ మహిళ), ఓసీ, కోటగిరిలో ఎస్సీ, రాంపూర్‌లో (ఓసీ), ఎత్తొండ ఎస్టీ(మహిళ), రెంజల్ మండలం బాగెపల్లిలో (బీసీ-బీ మహిళ), కూనేపల్లి ఓసీ, నీల ఓసీ (మహిళ), రుద్రూర్, రాయకూర్ ఓసీ, సులేమాన్‌నగర్ (బీసీ-సీ), బొప్పాపూర్ ఎస్టీ, రుద్రూర్ ఎస్సీ, ఎడపల్లి మండలం ధర్మారం ఓసీ, వడ్డేపల్లి(బీసీ-డీ,మహిళ) ఖాళీలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులు చేసుకునే వారు పదవ తరగతి పాసై ఉండాలని, చౌకధరల దుకాణం పరిధిలో నివాసియై ఉండాలని, గ్రామ పంచాయతీ/వార్డు పరిధిలో ఉన్న వారికి, మహిళా శ్వయంశక్తి గ్రూపులకు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబంలోని సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వికలాంగులకు కేటాయించిన ఖాళీలకు దరఖాస్తు ఆయా మండల పరిధిలోని వారై ఉండాలని, ఒక వేళ నియామకం చేయబడితే, వారు ఆ దుకాణం ఉండబడిన ప్రాంతానికి తన నివాసం మార్చుకోవాలని సూచించారు. 18సంవత్సరాల వయస్సు నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలని, చౌకధరల దుకాణ డీలర్ నియామకం అయిన వారు తప్పనిసరి 5సంవత్సరాలు పని చేయవలసి ఉంటుందని తెలిపారు. చౌకధరల దుకాణానికి కేటాయించబడిన సరుకులకు సరిపడే ఆర్థిక స్థోమత కలిగి ఉండాలని, మంచినడవడిక కలిగి ఉండాలని, క్రిమినల్ కేసులలో గానీ, నిత్యావసర సరుకుల చట్టం కింద గాని శిక్షించబడి ఉండరాదని పేర్కొన్నారు. సంపూర్ణం ఆరోగ్యవంతుడై ఉండాలని, అర్జీదారు డీలరుగా వారే దుకాణం నడిపించాలని, లాభదాయకమైన ప్రభుత్వ పదవి, ఏ హోదాలో ఉండవద్దని సూచించారు. అభ్యర్థులు రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో సహా రాత పరీక్షకు తేదీ 26న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్య పట్ల శ్రద్ధ వహించాలి

- జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విద్య


మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్‌వో డాక్టర్ విద్య

**నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)**
విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ద వహించాలని కామారెడ్డి జిల్లా డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో విద్య సూచించారు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో వైద్య, ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విద్య పరిశీలించి, విద్యార్థుల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్య మాట్లాడుతూ.. విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ఆరోగ్యంగా ఉండాలని అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని, శారీరకంగా ఆరోగ్యంతో ఉండాలని సూచించారు. విద్యార్థులకు వచ్చే సంక్రమిత, అసంక్రమిత వ్యాధులతో పాటు, సీజనల్ వ్యాధుల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బయటి తినుబండరాలకు దూరంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతిగృహాలు, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి, వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ దివ్య, సిహెచ్ఓ, దయానంద్, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

## సహాయక చర్యల్లో పాల్గొన్న

# అధికారులందరికి ధన్యవాదాలు

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**నవతెలంగాణ-కామారెడ్డి**
శనివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వారికి అందించే సహాయక చర్యలో పాల్గొన్న అధికారులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్టు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి, కాకతీయకాలనీ, టెక్రియాల్, నిజాంసాగర్ రోడ్డు, సిఎస్ఐ చర్చి ప్రాంతం, అశోకనగర్, కేపీఆర్ కాలనీ, సైలన్ బాబాకాలనీ, టీచర్స్ కాలనీ, గాంధీనగర్, బతుకమ్మకుంట, అయ్యప్పకాలనీ, హరిజనవాడ, స్టేషన్ రోడ్, పంచముఖి హనుమాన్ టెంపుల్‌ను ప్రాంతాలను సోమవారం ఉదయం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పర్యవేక్షించారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని అన్ని చెరువులు, వాగులు పొంగిపొర్లుతున్నాయని, అవసరం ఉంటే తప్ప ప్రజలు బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. వరద, ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం పరిస్థితి అంతా క్షేమంగానే ఉందని అన్నారు.

## తెగిన ఎలక్ట్రిసిటీ వైర్

- వెంటనే స్పందించిన అధికారులు
- తప్పిన పెను ప్రమాదం


తెగిపడిన విద్యుత్ వైర్

**నవతెలంగాణ-పొతంగల్**
మండల కేంద్రంలో నిత్యం తెల్లవారుజాము నుంచే రద్దీగా ఉండే హనుమాన్ మందిరం, పాత పొతంగల్ వద్ద తెల్లవారుజామున 4 గంటలకు ఎలక్ట్రిసిటీ పోల్ వైరు తెగి మోటార్ సైకిల్‌పై పడింది. ఎవరూ అటువైపు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ విషయాన్ని వెంటనే చరవాణి ద్వారా ఎలక్ట్రిసిటీ అధికారులకు తెలుపగా అధికారులు స్పందించి వెంటనే రంగంలో దిగి, సమస్యను పరిష్కరించారు.

## విద్యార్థులకు పలకలు పంపిణీ


విద్యార్థులకు పలకలు అందజేసిన కాంగ్రెస్ ఇంచార్జి

**నవతెలంగాణ-వర్ని**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ కిసాన్ కాంగ్రెస్ ఇంచార్జ్ శనిగరం కిషన్, జాకోరా గ్రామంలో ఎస్సీ కాలనీలో అంగన్వాడీ పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు పిట్ల సాయిలు, షేక్ రంజాన్, పోచారం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పొలాల అమవాస్య


ఎడపల్లి: ఆలయం చుట్టు ఎడ్లు తిప్పుతున్న రైతుల


రెంజల్‌లో...

**నవతెలంగాణ-బోధన్/రెంజల్**
రైతులకు నిరంతరం వ్యవసాయంలో అండగా ఉంటున్న ఎడ్లను ఎడ్లపొలాల అమావాస్య సందర్భంగా రైతులు సోమవారం వాటికి ముస్తాబుచేసి ఎడ్ల పొలాల పండగను ఘనంగా నిర్వహించారు. బోధన్ ఉమ్మడి మండలంలో రైతులు ఘనంగా పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్లను ఉదయమే స్నానం చేయించి రంగులు వేశారు. సాంప్రదాయంలో భాగంగా వాటికి పౌష్టికాహారం అందించి సాయంత్రం రంగురంగుల వస్త్రాలతో ముస్తాబుచేసి హనుమాన్ ఆలయం చుట్టు ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం రైతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి బసవన్నలను పూజించారు.

**వీరన్నగుట్ట గ్రామంలో..**
**రెంజల్ :** మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో గ్రామస్తులు ఘనంగా పొలాల అమావాస్య వేడుకలను నిర్వహించారు. హనుమాన్ మందిరానికి చెందిన గోమాతలను అత్యంత భక్తిశ్రద్ధలతో కడిగి రంగులు వేసి, హనుమాన్ మందిరం చుట్టూ తిప్పారు. అనంతరం వాటికి పిండి వంటలు తయారు చేసి తినిపించారు. పండుగల పురస్కరించుకొని హనుమాన్ మందిరం చుట్టూ ప్రదక్షణ చేసిన అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు శంకర్, గుంజే గంగాధర్, ఆంజనేయులు, ఆనంద్, లక్ష్మణ్, మహేష్, మాణిక్యం, గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.

**పశువుల శుభ్రం..**
**మద్నూర్ :** ఎడ్ల పొలాల అమావాస్య సందర్భంగా పశువులకు స్నానం చేయించి శుభ్రం చేయిస్తారు. సాయంత్రం హనుమాన్ మందిరానికి ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రదక్షిణలు చేయించుకుని ఇంటికి తీసుకువచ్చిన తర్వాత ఆవులతో ఎడ్లకు పెండ్లిలు నిర్వహిస్తారు. ఈ పండుగ రోజున గోవులను కూడా స్నానం చేయించి శుభ్రపరిచి హనుమాన్ ఆలయానికి ప్రదక్షిణలు వేయిస్తారు. మద్నూర్ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నారాయణ గోశాల గోవులను కాపలదారులు దత్తు, మాధవ్, ఇద్దరూ ఆవులను స్నానం చేస్తుండగా రథం గల్లి యువకుడు బండి హనుమాన్లు గోవుల స్నానం చేయించే కార్యక్రమానికి సహకరిస్తూ గోవులను శుభ్రం చేశారు. ఆ యువకుని సేవా భావాన్ని గల్లీ ప్రజలు అభినందించారు.

**ఎడపల్లి :** మండలంలోని పలు గ్రామాలలో ఎడ్ల పొలాల పండగను ఘనంగా నిర్వహించారు. పశువులను శుభ్రం చేసి రంగులు దిద్దారు. అనంతరం రంగులతో కూడిన బట్టలను ఎడ్లపై వేసి డప్పు వాయిదాల మధ్య రైతన్నలు గ్రామంలోని హనుమాన్ మందిరం చుట్టూ ప్రదర్శించారు.

**మద్నూర్ :** మండల కేంద్రంలో ఎడ్ల పొలాల పండుగ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉత్సవంగా ఘనంగా జరుపుకున్నారు. వ్యవసాయదారులు ఎడ్ల పొలాల అమావాస్యను పురస్కరించుకొని తమ ఎడ్లను గ్రామంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి పాతబస్టాండ్ సమీపంలో గల హనుమాన్ ఆలయానికి ఐదు ప్రదక్షిణాలు వేయించుకొని ఇండ్లకు తీసుకువచ్చారు. ఇంటికి వచ్చిన తర్వాత ఎడ్లకు ఆవులతో పెండ్లిలు జరిపారు. ఈ పండుగకు మాన్కార్ పటేల్ రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఎడ్ల పొలాల అమావాస్య నిర్వహించారు. ముందుగా మాన్కార్ పటేల్ ఎడ్లను ఊరేగించిన తర్వాత గ్రామంలోని వ్యవసాయదారుల ఎడ్లు ఊరేగిస్తూ మందిరం వద్ద ప్రదక్షిణలు చేయించారు.

**కోటగిరి :** మండలంలో పొలాల అమావాస్య పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నల్ల మట్టిని సేకరించి మట్టితో ఎడ్లను తయారు చేసి పూజ గదిలో పెట్టి నైవేద్యం సమర్పించి ఉపవాసంతో సాయంత్రం ఎడ్లకు ఇంటి ముందట హారతి ఇచ్చి హనుమాన్ దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఊరంతా భాజా భజంత్రీలతో ఎడ్లు, ఆవులను త్రిప్పి ఘనంగా పండగ జరుపుకున్నారు.

**పెద్దకొడప్‌గల్ :** అన్నదాతలకు సాగులో తోడుండే మూగజీవాలను కొలిచే పొలాల అమావాస్యను మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఘనంగా జరుపుకున్నారు. ఎడ్లకు పూల దండలు, గజ్జెలు కట్టి కొత్త కన్నాలతో ముస్తాబు చేసి బసవన్నలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. హనుమాన్ దేవాలయాల్లో ఎడ్లతో ప్రదక్షిణలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు.


మద్నూర్: ఆలయం చుట్టు ఎడ్లను తిప్పుతున్న గ్రామస్తులు


ఎద్దుకి స్నానం చేయిస్తున్న రైతులు


బోధన్‌లో...


కోటగిరిలో...


పెద్దకొడప్‌గల్‌లో...

## వసతి గృహం సందర్శన

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని సోమవారం డిస్టిక్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ స్రవంతి సందర్శించారు. భారీ వర్షాల దృశ్య అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వసతి గృహ సంక్షేమ అధికారులను ఆదేశించారు. అసిస్టెంట్ బీసి వెల్ఫేర్ ఆఫీసర్ గంగా కిషన్ తదితరులు ఉన్నారు.



## చెరువులు, వాగులవద్దకు వెళ్లొద్దు : ఎంపీడీవో

నవతెలంగాణ - భీంగల్‌రూరల్

భీంగల్ మండలంలోని పల్లికొండ, బాచన్ పల్లి, పిప్రి, మెండోరా గ్రామాల్లో భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజా పరిషత్ అధికారి సంతోష్ కుమార్ సందర్శించారు. చెరువులు, వాగులవద్దకు ఎవరు వెళ్లకూడదని, అత్యవసర పరిస్థితి ఉంటేనే గాని బయటకు వెళ్లకూడదని తెలిపారు. దారిలో ఉన్న పల్లికొండ వంతెనను పరిశీలించారు. తర్వాత బాచన్ పల్లి, పిప్రీ గ్రామాల్లో పర్యటించి మంచినీటి ట్యాంక్ ను పరిశీలించి, పారిశుధ్యం మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.


పరిశీలిస్తున్న ఎంపీడీవో

## ఖానాపూర్ రోడ్డుపై చేరిన వరదనీరు

- నీటిని తొలగిస్తూ బారికేడ్లు ఏర్పాటు


నీరుపోయేలా రోడ్డుపై హోల్స్ క్లియర్ చేస్తున్న సిబ్బంది

నవతెలంగాణ- నిజామాబాద్‌రూరల్

ఖానపూర్ విలేజ్ రోడ్ బ్రిడ్జిపై నుండి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అక్కడ బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఈరోడ్డుపై వరదనీటిలో నుండి వెళ్తుండగా గత సంవత్సరం ఇద్దరు కొట్టుకపోయినందున ముందస్తు చర్యల్లో భాగంగా కర్రలతో బారికేడింగ్ ఏర్పాటు చేశారు. రోడ్డుపై నీరు నిలవకుండా ఏర్పాటుచేసిన హోల్స్ చెత్తాచెదారం తట్టి మూసుకుపోయాయి. హోల్స్‌వద్ద చెత్తను మున్సిపల్ సిబ్బంది తొలగించి నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకున్నారు. ఈపనుల్లో ఏఈ సుభాష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శ్రావణ్, రాజశేఖర్, నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్ద వాగు పరిశీలించిన ఎంపిడిఓ

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బాడ్సి గ్రామంలో గల పెద్ద వాగు బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న నీటిని ఎంపిడిఓ రాములు సోమవారం పరిచిలించారు. నీటి ప్రవాహంతో కొట్టుకు వచ్చిన చెత్తను, పిచ్చి మొక్కలను జె సి బి సహాయంతో తొలగించారు. ఆయన వెంట గ్రామ సిబ్బంది, స్థానికులు ఉన్నారు.

## రైతులకు రుణం చెక్కులు పంపిణీ


రుణం చెక్కులు అందజేస్తున్న చైర్మన్

నవతెలంగాణ - మాక్లూర్

మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మొదటి విడతలో రుణ మాఫీ పొందిన 54 మంది రైతులకు రూ. 41లక్షల 46వేల చెక్కులను చైర్మన్ బుర్రోళ్ళ అశోక్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన రుణ మాఫీ పొందిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు ఆర్థికంగా బలోపేతమైతేనే ఇతర రంగాల అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకర సంఘం వైస్ చైర్మన్ గుండారం శేఖర్, డైరెక్టర్లు, కార్యదర్శి బి.ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన కాంగ్రెస్ ద్వారానే సాధ్యం

మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మాజీ ఎంపీపీ తెలంగాణ ఉద్యమకారుడు కంచెట్టి గంగాధర్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన 12 మంది లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రజా పాలనలో పేద ప్రజలకోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని, దీనికి నిదర్శనమే 12 మంది లబ్ధిదారులకు సుమారు ఏడు లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేయడమే నన్నారు. కార్యక్రమంలో హబీబ్, పార్టీ కార్యకర్తలు లబ్ధిదారులు, నాయకులు పాల్గొన్నారు.

## నేడు అన్నదానం

నవతెలంగాణ-ముప్కాల్

ఎడ్ల పొలాల అమావాస్య సందర్భంగా మంగళవారం ఉదయం ముప్కాల్ మండల కేంద్రంలో అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కనుగుంట లింగం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన సత్రం విజయవంతం చేయాలని కోరారు. రైతులు తమ తమ ఇండ్లల్లో ఎడ్ల పొలాల అమావాస్యను జరుపుకున్నారు. పంటలు బాగా పండాలని దేశ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు.

## వర్షాలకు మూడు నివాస గృహాలకు నష్టం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామంలో ఒకటి, గౌరారం గ్రామ పంచాయతీ పరిధిలోని లింగపుర్ గ్రామం వద్ద రెండు నివాసపు గృహాలకు నష్టం జరిగినట్టు తహసీల్దార్ వెంకట్‌రావు సోమవారం తెలిపారు. సంస్థాన్ సిర్నపల్లి గ్రామానికి చెందిన పోగుల బొంబాయి నర్సయ్య, లింగపూర్ గ్రామానికి చెందిన మాల లక్ష్మీ, గోవింద్ పల్లి బలవ్వ నివాస గృహాలు గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి తడిసి పోయి తీవ్ర నష్టం వాటిల్లిందని, బాధిత కుటుంబానికి అందుకోవాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వం నుండి వచ్చే ఫలాలను అందజేయనున్నట్టు తెలిపారు. నష్టపోయిన వివరాలను ఉన్నతాధికారు లకు అందజేసినట్లు తహసిల్దార్ వెంకట్‌రావు తెలిపారు.


కూలిన ఇంటి పైకప్పు

## విషజ్వరాల బారిన పడకుండా ప్రజలను

# కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకటరాములు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజలను విషజారాల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం( వ్యకాస) జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట రాములు తెలిపారు. సోమవారం సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆయన మాట్లాడుతూ.. వాయుగుండం కారణంగా తెలుగు రాష్ట్రాలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మన తెలంగాణ ప్రభుత్వం కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ప్రకటించిన జిల్లాల్లో మన నిజామాబాద్ జిల్లా కూడా ఉన్నది. రెడ్ అలర్ట్ ప్రకటించటం, స్కూళ్లకు సెలవు ప్రకటించడం తోటే సరిపోదు. ప్రజల్ని విష జ్వరాల బారిన పడకుండా కాపాడవలసిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణం పరిస్థితుల విష జ్వరాలు ప్రబలడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్, చికున్ గున్యా, డెంగ్యూ లాంటి ప్రమాదకరమైన జబ్బులతోటి వయస్సుతో సంబంధం లేకుండా రోగాల బరిన పడుతూ మంచాన పడుతున్నారని తెలిపారు. మన జిల్లాలో కొంతమంది చనిపోయినట్టు కూడా వార్తలు వస్తున్నాయని, ఇలాంటి పరిస్థితి నుంచి ప్రజల్ని కాపాడడానికి సమర్థవంతంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతూ మురికి కాలువలలో డిడిటి లాంటి దోమల నివారణ మందులను స్ప్రే చేస్తూ, దోమలు లేకుండా చర్యలు తీసుకున్నట్లయితే విష జ్వరాల బారిన పడకుండా ప్రజలు కాపాడబడతారని సూచించారు. గ్రామాల వారీగా పట్టణాలు, వార్డుల వారీగా మెడికల్ క్యాంపులు పెడుతూ అన్ని రకాల మందుల్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే తీవ్ర వర్షాల ప్రభావం వల్ల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చెరువులకు, కాలువలకు, గండ్లు పడుతున్నాయన్నారు. అలాంటి పరిస్థితులు నిజామాబాద్‌లో కూడా వచ్చే అవకాశం ఉంది కాబట్టి ముందు జాగ్రత్త చర్యలు చేపడుతూ ఆహారాన్ని అందించే పంటలను కాపాడాలని కోరారు. ఎప్పటికప్పుడు నిఘా పెంచుతూ వ్యవసాయాన్ని కాపాడుతూ ఒకవేళ ఊహించని విధంగా నష్టాలు జరిగితే వెంటనే అంచనా వేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అదే గ్రామాల్లో కానీ పట్టణాల్లోకానీ ముంపుకు గురయ్యే కాలనీల్లో ప్రజలను, అలాగే పాత ఇళ్లల్లో నివసిస్తున్న ప్రజలను ప్రాణహాని, జరగకుండా పునరావాస కేంద్రాలకు తరలించి అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాల గురికాకుండా వారందరికీ పక్కా ఇల్లు కట్టించాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్ది వెంకటరాములు

## అలుగెల్లిన చింతల చెరువు

- మానిక్‌బండార్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు

నవతెలంగాణ - మాక్లూర్

శనివారం అర్ధరాత్రి పట్టిన ముసురు రెండు రోజులు అయిన ఇంకా వదట్లేదు. భారీ వర్షాలకు మండల కేంద్రంలోని చింతల చెరువు అలుగు ఉప్పొంగొంతుంది. దీంతో చెరువు వద్ద చేపలు పట్టే వారితో సందడి నెల కొంది. మాణిక్ బండార్‌లో భారీ వర్షాల కారణంగా కాలనీలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. మోకాళ్ళ లోతు నీరు చేరడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వర్షపు నీరు వెళ్లేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆ కాలనీవాసులు కోరుతున్నారు.


కాలనీలో నిలిచిన నీరు


అలుగు పారుతున్న చెరువు


చెరువు వద్ద కొబ్బరికాయ కొడుతున్న తహసీల్దార్

## నిండుకుండలా చెరువు

- పుజలు చేసిన గ్రామస్తులు, తహసీల్దార్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎన్నో ఏండ్లుగా ఎండిపోయిన గన్నారం చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిస్థాయిలో నిండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. చెరువును పరిశీలించేందుకు సోమవారం గ్రామస్తులు వెళ్లగా.. నీళ్లను చూసి ఉబ్బితబ్బిబ్బయ్యారు. దీంతో అక్కడే కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి మోహన్, చరణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

# మొదటిస్థానంలో ములుగు, హైదరాబాద్

- ముగిసిన రాష్ట్ర టెన్నికాయిట్ ఛాంపియన్ షిప్ పోటీలు

నవతెలంగాణ -ఆర్మూర్

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల లో 8వ రాష్ట్ర సబ్-జూనియర్ టెన్నికాయిట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా కౌన్సిలర్ ఫయాజ్ మాట్లాడుతూ జాతీయ పోటీలలో రాష్ట్ర జట్టు పతకం సాధించేలా కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో అన్ని క్రీడలు జరుపుకోవడానికి ఈ ఇండోర్ స్టేడియన్ని వినియోగించుకోవాలని అన్నారు. మొదటి స్థానం పొందిన క్రీడాకారులకు 2000 రూపాయల నగదును అందజేశారు. జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు మేడిదల రవి గౌడ్ మాట్లాడుతూ.. ఈనెల 31 నుండి అక్టోబర్ 4 వరకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగే సబ్ జూనియర్ జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన క్రీడాకారులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గెలుపొందిన క్రీడాకారులకు 8000 రూపాయల నగదును అందజేశారు. రెండు ఇండోర్ స్టేడియంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించుటకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. టోర్నమెంట్ కన్వీనర్ జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ఆర్మూర్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ ఈ పోటీలకు విచ్చేసి జయప్రదం చేసిన 24 జిల్లాల కోచ్, మేనేజర్, పిఈటి, పీడీలు ధన్యవాదాలు తెలిపారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ మొదటి స్థానం పొందిన క్రీడాకారులకు 1000 రూపాయల నగదును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యాం కుమార్, రోటరీ సంస్థ అధ్యక్షులు రాజ్నిష్, సభ్యులు రాస ఆనంద్, వన్నెల దాస్, విద్య ప్రవీణ్ ,జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ చైర్మన్ బొజ్జ మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఈ భూపతి, కోశాధికారి మర్కంటి గంగామోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, జిల్లా టెలికాయిట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సంగీతరావు, రాజ్ కుమార్, సభ్యులు నాగభూషణం, అనిల్, నరేష్, కామారెడ్డి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాయి మౌర్య, ఉపాధ్యాయులు భూమేశ్వర్, రాజేందర్, గంగా నర్సయ్య పాల్గొన్నారు.



నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విజేతలు

**విజేతలు వీరే..**

బాలుర విభాగంలో మొదటి స్థానం రామన్న ములుగు, ద్వితీయ స్థానం చాణక్య కరీంనగర్, తృతీయ స్థానం సాత్విక్ ములుగు, నాలుగవ స్థానం సిద్దార్థ కరీంనగర్, బాలికల విభాగంలో మొదటి స్థానం కీర్తి హైదరాబాద్, ద్వితీయ స్థానం ఆనందిత నిజామాబాద్, తృతీయ స్థానం రోహిణి ప్రియ ములుగు, నాలుగో స్థానం నవ్య హనుమకొండ గెలుపొందాయి.

# నీట మునిగిన సోయా, వరి

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- కమ్మర్‌పల్లిలో 81.4 మిల్లి మీటర్ల వర్షం
- మత్తడులు దూకుతున్న చెరువులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో ఆదివారం ఉదయం నుండి సోమవారం ఉదయం వరకు కమ్మర్ పల్లి లో 81.4మిల్లి మీటర్ల భారీ వర్షం కురిసింది.ఆదివారం రాత్రి నుండి సోమవారం తెల్లరే జమున వరక ఏకదాటిగా భారీ వర్షం కురిసింది.భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది.మండల కేంద్రం నుండి ఉప్లూర్ వెళ్లే దారిలో ఆదివారం రాత్రి వరద కాలువ సమీపంలోని కల్వర్టు వద్ద బీటి రోడ్డు పైనుండి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పాడ్డాయి. కల్వర్టు వద్ద బీటి రోడ్డు మరింతగా కోతకు గురై ప్రమాదకరంగా మారింది.రాత్రివేళ ప్రయాణం చేసే వాహనదారులు కొతకు గురైన కల్వర్టును గమనించకుండా అటువైపుగా వెళ్తితే ప్రమాదాలకు గురయ్యే అస్కారం ఉంది.కల్వర్టు కాలువకు ఇరువైపులా భారీ వరద నీరు మూలంగా కాల్వ గట్లు కోతకు గురై పంట పోలాల్లోకి వరద నీరు చేరి వరి పోలాలు, సోయా పంటలు నీట మునిగాయి.గత రెండు రోజులుగా పంటలు నీటిలోనే మునిగి ఉన్నాయి.పంటలు నీటిలోనే ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.భారీ వర్షాల మూలంగా పలు చోట్ల వరి పోలాల్లో ఇసుక, మట్టి మేటలు వేశాయి.దీంతో పెద్ద ఎత్తున సోయా, వరి, పసుపు పంటలకు నష్టం వాటిల్లే అస్కారం ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.అధిక వర్షం మూలంగా రోజుల తరబడి పంటలు నీటిలోనే ఉండడం వల్ల పంటలు కుళ్ళిపోవడంతో పాటు అధికంగా తెగుళ్ళు సోకేందుకు అస్కారం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.కాగా భారీ వర్షాలతో చిన్న చిన్న కుంటలు,పంట కాలువల నుండి వరద నీరు పెద్ద ఎత్తున చెరువుల్లోకి చేరడంతో అన్ని చెరువులు మత్తడులు దూకుతున్నాయి.


సోయాపంటలో చేరిన నీరు


నీటమునిగిన వరిచేను

**నీట మునిగిన పంటలు...**

మూడూ రోజుల క్రితం కురిసిన భారీ వర్షంతో వచ్చిన వరదలకు పంట పోలాలు దెబ్బతిన్నాయి.నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంట పోలాలను రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని మళ్ళీ సాగుకు అనుకులంగా మలుచుకున్నారు.తిరిగి ముడూ రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మరోసారి పంట పోలాల్లో ఇసుక, మట్టి మేటలు వేశాయి.పోలాల గట్లు కొతకు గురవ్వడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ వర్షాకాలంలోనే ఇప్పటికి రెండు సార్లు పంటలు నీట మునగడంతో ఈ సంవత్సరం ఖరీఫ్ పంట చేతికి వస్తోందో లేదో అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.వర్షాలు కురవడం సంతోషంగానే ఉన్న అధిక వర్షంతో పంటలు నీట మునగడమే ఇబ్బందిగా ఉందని రైతులు అంటున్నారు.

## కార్పొరేటర్‌పై కేసు నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని 3 వ పోలీస్ స్టేషన్ పరిధిలో కార్పొరేటర్ పై కేసు నమోదు చేసినట్లు మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ సోమవారం తెలిపారు. మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గతనెల 23న గౌతమ్ నగర్‌కు చెందిన శివచరణ్ కార్పొరేటర్ ఇంటి ముందు నుండి సురేష్ అనే వ్యక్తి వెళ్తున్నాడు. ఆయనను అడ్డుకొని తన ఇంటి ముందు నుండే వెళ్తావా అని సురేష్‌ని బెదిరించి బూతు మాటలు తిట్టి , కార్పొరేటర్ శివ చరణ్, ఆయన తమ్ముడు ప్రమోదులు సురేష్‌ని కొట్టారు. గాయపడిన సురేష్ సోమవారం పోలీస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేష్ కార్పొరేటర్ శివ చరణ్, ఆయన తమ్ముడు ప్రమోద్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నష్టపరిహారం అందజేయాలి

నవతెలంగాణ నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్రంలో రెండు రోజులుగా దంచి కొడుతున్న వర్షాల మూలంగా లక్షలాది ఎకరాలలో పంట భూముల్లో ఇసుకమేటలతో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని ఏఐపికే ఏస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. వి. ప్రభాకర్. రాష్ట్ర కార్యదర్శి బి. దేవారం.డిమాండ్ చేశారు. ఇసుక తొలగించడానికి వరిపంటకు ఎకరానికి 25వేలు, వ్యాపార పంటలకు ఎకరాన 50వేల. ప్రాణ నష్టపోయిన కుటుంబాలకు పది లక్షల రూపాయల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

# మట్టి దిబ్బలు కూలే కాలం... జాగ్రత్త

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వరుసగా భారీ వర్షాలు కురుస్తున్నందున మట్టి దరుల కింద పనులు చేసుకునే వారు తప్పని సరిగా అప్రమత్తంగా ఉంటూ పనులు చేసుకోవాల్సిన అవసరం ఉంది.కాలువలు, గుట్టలసమీపంలో తవ్వకాలతో ఎత్తయిన కుప్పలుగా పోసిన మట్టి వర్షాలు బాగా కురిసినప్పుడు మెత్తబడి కుప్పలో మట్టి వదులుగా మారి కుప్ప కూలిపోతుంది.ఇలాంటి సంఘటనల్లో కూలీలు సజీవ సమాది అయిన సందర్భాలు గతంలో ఉన్నాయి.

బాల్కొండ నియోజకవర్గంలోని శ్రీరాం సాగర్ ప్రాజెక్టు వరద కాలువ వెంట, కాకతీయ కాలువ వెంట బాల్కొండ, మెండోరా, ముప్కాల్ మండలాల నుండి మొదల్కొని కమ్మర్‌పల్లి మండలం వరకు కాలువల తవ్వకాల నాటి మట్టి కుప్పలు చాలా ఉన్నాయి.వరద కాలువ వెంట చెట్టంత ఎత్తులో చిన్న సైజు గుట్టలను తలపించేంత పెద్ద మట్టి దిబ్బలు ఉన్నాయి.తవ్వకాల్లో ఈ మట్టితో బాటు వచ్చిన బండ రాళ్ళు ఈ మట్టిలో ఉండి పోయాయి.గ్రామాల్లో మట్టి, మొరం అవసరాలకు అప్పుడప్పుడు ఈ మట్టి దిబ్బల నుండి బండ రాళ్లను వెలికి తీసి కంకర కొట్టి ఉపాది పొందుతారు.ఇలాంటి సమయంలో వర్షాలతో మొత్తగా నాని వదులుగా మారిన దిబ్బలు ఒక్క సారిగా కూలి పొతాయి.వాటి కింద పనులు చేసుకునే వారు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి.గతంలో ఇలా జరిగిన సంఘటనలే ఇందుకు నిదర్శనం.బాగా వర్షాలు కురిసే సమయాల్లో వీటి కింద పనులు చేసుకునే వారు తగు జాగరూకతతో ఉండాల్సిన అవసరం ఉంది.


మట్టిదిబ్బ

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం


ఆర్థికసాయాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**నవతెలంగాణ-రామారెడ్డి**

అకాల వర్షాలకు నివాసపు ఇల్లు కూలిపోవడం బాధిత కుటుంబాలకు సోమవారం పలువురు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గోకుల్ తండాలో మెగావత్ రామచందర్, మాలోత్ సేవ్య బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింబాద్రి నాయక్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మద్దికుంటలో చిన్న లింగయ్య, కుమ్మరి ఎర్ర పోచయ్య, బెస్త శ్రీనివాస్ కుటుంబాలకు మండల ఇన్చార్జి వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దికుంట నర్సాగౌడ్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బాల్యానాయక్, హరిచందు, రామ్‌చంద్, సేవ్య, కాంగ్రెస్ నాయకులు సల్మాన్, బండి ప్రవీణ్, నర్సారెడ్డి, నరేందర్, బాలరాజు తదితరులున్నారు.

## ఘనంగా ఎడ్లపొలాల అమావాస్య


ఆలయం చుట్టూ ఎడ్లను తిప్పుతున్న దృశ్యం

**నవతెలంగాణ-పోతంగల్**

మండలంలోని అన్ని గ్రామాల్లో ఎడ్ల పొలాల అమావాస్య వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడ్లను శుభ్రంగా కడిగి అలంకరించారు. హనుమాన్ మందిరం చుట్టూ ప్రదీక్షణలు చేయించి పూజలు నిర్వహించారు.

# మహారాష్ట్ర-తెలంగాణకు రాకపోకలు బంద్

- అప్రమత్తమైన ఇరు రాష్ట్రాల అధికారులు
- కందకుర్తి వద్ద బారీకేడ్లను ఏర్పాటు

**నవతెలంగాణ-రెంజల్/బోధన్**

మండలంలోని కందకుర్తి గోదావరి వద్ద వరద ఉధృతి పెరగడంతో అధికారులు మహారాష్ట్ర-తెలంగాణ రెండు రాష్ట్రాల మధ్యగల బ్రిడ్జి గుండా రాకపోకలను నిలిపివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలోని బిలోలి చెక్‌పోస్టు వద్ద రాకపోకలను నిలిపివేయడానికి మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల అధికారులు అప్రమత్తమయ్యారు. నీటి ఉధృతి గంటగంటకూ పెరుగుతూ ఉండడంతో రాకపోకలను నిలిపివేశారు. రోడ్డుకు అడ్డంగా ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లో భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ధర్మవాత్ సీఐ బాలాజీ గయిక్వాడ్, రెంజల్ తహసిల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆరే రవికుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

**మొండి వాగును పరిశీలించిన ప్రత్యేక అధికారి**

మండల కేంద్ర సమీపంలోని మొండి వాగులో వరద ఉధృతిని మండల ప్రత్యేక అధికారి వాజీద్ హుస్సేన్, తహసీల్దారు శ్రావణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది సోమవారం పరిశీలించారు. వరద ఉధృతి పెరగడంతో ప్రజలను అప్రమత్తం చేశారు. అలీసాగర్ ప్రధాన గేట్లన్నీ ఎత్తివేయడంతో మొండి వాగులో వరద ఉధృతి తీవ్రంగా పెరిగింది. పశువుల కాపరులు, మత్స్యకారులు వాగులోకి రాకూడదని వారు చాటింపు వేయించారు. వర్షాలు విపరీతంగా కురుస్తుండటంతో ప్రజలు అత్యవసర పనులకు తప్ప బయటకి రాకూడదని వారు పేర్కొన్నారు.

**నీటి ఉధృతి పరిశీలన..**

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం నుంచి వరద ఉధృతి పెరుగుతూ ఉండటంతో ప్రజలను అప్రమత్తం చేయడానికి మండల స్థాయి అధికారులు తహసీల్దార్ శ్రవణ్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై ఈ.సాయన్న, విద్యుత్ ఏఈ రాజలింగం పరిస్థితులను సమీక్షించారు. నీటి ఉధృతి తగ్గేవరకూ ప్రజలు బ్రిడ్జిపై నుంచి గానీ ఘాట్‌ల వద్దకు గానీ రాకూడదని హెచ్చరికలను జారీ చేశారు.


రెంజల్ : మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి వాహనాలు రాకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు


బోధన్ : హంగర్గను సందర్శిస్తున్న పోలీసులు

**ఘాట్ వద్దకు ప్రజలు రావొద్దని చాటింపు..**

మండలంలోని కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం వద్ద నీటి ఉధృతి గంటగంటకూ పెరుగుతూ ఉండడంతో బ్రిడ్జిపైకి గానీ, గాట్ల వద్దకు గానీ ప్రజలు రాకూడదని స్థానిక అధికారులు చాటింపు వేయించారు. గోదావరి పొంగి పొర్లుతూ ఉండడంతో మత్స్యకారులు, పశువుల కాపరులు గోదావరి తీరానికి రాకూడదని వారు పేర్కొన్నారు. బ్రిడ్జి పైనుంచి రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు వివరించారు.

**హంగర్గను సందర్శించిన పోలీసు అధికారులు**

**బోధన్ :** బోధన్ మండలం మారుమూల గ్రామమైన హంగర్గ గ్రామాన్ని పోలీసు అధికారులు సోమవారం సందర్శించి పరిస్థితులను తెలుసుకున్నారు. ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ గ్రామంలో రావడంతో సమీపంలోని పంట పొలాలు ప్రతి సంవత్సరం నీట మునుగుతాయి. ప్రస్తుతం కూడా సోయా పంట చాలా వరకు మునిగిపోయిందని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ ప్రాజెక్ట్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బ్యాక్‌వాటర్ గ్రామంలో చేరకుండా నీటిని మరింతగా విడుదల చేసుకోవాలని సూచించారు. అలాగే ముందు జాగ్రత చర్యలో భాగంగా శిథిలావస్థకు చేరిన ఇండ్లలో గాని, ముంపునకు గురయ్యే ఇండ్లను గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఆయన వెంట సీఐ నరేష్, ఎస్ఐ మచ్చేందర్‌రెడ్డి, స్థానిక పెద్దలు శ్యాంరావు, గంగాధర్, శివకుమార్ గ్రామస్థులున్నారు.

**భారీ వర్షంతో, ఇండ్లు, చెరువు కట్టలు ధ్వంసం**

**రామారెడ్డి :** మండలంలో శనివారం రాత్రి నుండి కురుస్తున్న వర్షాలకు మండలంలో చెరువు కట్టలు, నివాసపు ఇండ్లు కూలిపోయాయి. మద్దికుంట మూడు ఇండ్లు, గోకుల్ తండాలో 2, ఇండ్ల గోడలు కూలిపోయాయి. రెడ్డి పేట గ్రామ శివారులోని దామెర చెరువు కట్ట తెగిపోవడం నీరు పంట పొలాల్లోకి చేరటంతో, పంట పొలా నీట మునిగాయి. రాజమ్మ తండాలో సీసీ రోడ్డు క్రింద నీరు చేరి, కాల్వ గా మారడంతో, సంఘటన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. రెడ్డి పేట స్కూల్ తండా, ప్రభుత్వ పాఠశాలలో నీరు చేరడంతో, పాఠశాల సామాగ్రిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. మద్దికుంట స్మశాన వాటికకు వెళ్లే దారిలో నాగిరెడ్డి చెరువు అలుగు పై పోసిన కట్ట తెగిపోవడంతో, స్మశాన వాటికకు వెళ్లే దారి లేకుండా పోయింది. వాగులు, గొర్రెలు ప్రమాదవశాత్తు గా ప్రవహించి, తెగిపోవడం, పైనుంచి నీరు ప్రవహించడంతో పలు గ్రామాల్లో పంట పొలాల్లో మట్టి చేరటం, పంట పొలాలు నీటిలో మునిగిపోయాయి.

**కూలిపోయిన ఇళ్లను పరిశీలించిన అధికారులు**

**ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో గత 2 రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి ఇల్లు కూలిపోయిన విషయం తెలుసుకొని సోమవారం తహసిల్దార్ మహేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు సిబ్బందితో కలిసి పట్టణంలో పర్యటించారు. కూలిన ఇళ్లతో పాటు శిథిలావస్థకు చేరిన ఇళ్లను పరిశీలించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు పురాతన ఇల్లు, భవనాలలో నివసించవద్దని, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏకధాటిగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తామని అన్నారు.


రామారెడ్డి : కొట్టుకుపోయిన రోడ్డు


ఎల్లారెడ్డి : కూలిపోయిన ఇల్లును పరిశీలిస్తున్న ఆర్డీవో


రెంజల్ : ఘాట్ వద్దకు రావొద్దని చాటింపు

## భారతీయ జీవిత బీమా 68వ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న ఉద్యోగులు

**నవతెలంగాణ-రామారెడ్డి**

ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి 68 సంవత్సరాల నుంచి బీమా సేవలు అందిస్తూ, భారత ప్రభుత్వానికి అండగా, భారతదేశ అభివృద్ధిలో భారతదేశ అభివృద్ధిలో భాగస్వామ్యం దినదినాభివృద్ధి చెందుతున్న భారతీయ జీవిత బీమా 68వ వార్షికోత్సవాన్ని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవిత బీమా కార్యాలయంలో అధికారులు, విస్తరణ అధికారులు, ఏజెంట్లు కేక్ కట్ చేసి సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ కృష్ణ మోహన్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ చవాన్, ముఖ్య అతిథిగా ఐడిబిఐ బ్యాంక్ అధికారులు, విస్తరణ అధికారులు వీరేశలింగం, రంజిత్‌రెడ్డి, మారుతి, ప్రవీణ్, ఏజెంట్ కిషోర్ చందు, నారాయణరావు, బాల్ కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక (గెస్ట్ లెక్చరర్ల) పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**నవతెలంగాణ-బిచ్కుంద**

బిచ్కుంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో అతిథి అధ్యాపక (గెస్ట్ లెక్చరర్ల) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు ఉన్నవారు అర్హులని నెట్/సెట్/పీహెచ్డీ వారికి ప్రాధాన్యత ఇవ్వబడునని ఇంగ్లీష్ 1, తెలుగు 1, హిస్టరీ 2, ఎకనామిక్స్ 1, పొలిటికల్ సైన్స్ 1, కామర్స్ 1, ఫిజిక్స్ 1, కెమిస్ట్రీ 1, బాటనీ 2, జువాలజీ 2, సబ్జెక్టులకు గాను ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు జత చేసి, దరఖాస్తు ఫారాలను బిచ్కుంద డిగ్రీ కళాశాలలో ఈనెల 5వ తేదీ గురువారం మధ్యాహ్నం ఒకటి గంటలలోపు అందజేయాలని సూచించారు. ఇంటర్వ్యూ, డెమో ఈ నెల 6వ తేదీన శుక్రవారం ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోరారు.

## సబ్ కలెక్టర్‌ను కలిసిన మైనార్టీ నేతలు

**నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ నూతన సబ్ కలెక్టర్ ఇటీవల బాధ్యతలు చేపట్టిన కొప్పిశెట్టి కిరణ్మయిని బాన్సువాడ పట్టణ మైనార్టీ కార్యదర్శి ఎండి దావూద్ వారి సభ్యులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట పలువురు మైనారిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ బాధితులకు వైద్య సేవలు

**నవతెలంగాణ-భిక్కనూర్**

మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు రామేశ్వర్‌పల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్‌లు నీట మునిగి తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలను మెడికల్ అధికారి యేమిమా సోమవారం గ్రామంలో వైద్య సేవలు నిర్వహించారు. అనారోగ్యం, తీవ్ర జ్వరంతో, ఇతర ఇబ్బందులు పడుతున్న వారికి వైద్య సేవలు నిర్వహించి, మందులు అందజేశారు. తీవ్ర జ్వరం ఉన్నవారికి డెంగ్యూ మలేరియా పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించి వైద్య పరీక్షలకు కామారెడ్డి ఏరియా హాస్పిటల్ పంపించారు. మండల ప్రత్యేక అధికారి రజిత, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, హెచ్ఇవో వెంకటరమణ, స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది, తదితరులున్నారు.

## ఆలయ రహదారికి తాత్కాలిక మరమ్మతులు

**నవతెలంగాణ-భిక్కనూర్**

భిక్కనూరు పట్టణ కేంద్రంలో దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ రహదారి ఆదివారం కురిసిన భారీ వర్షం కారణంగా ధ్వంసమైంది. సోమవారం పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్ వాహనదారులకు, ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు పడకుండా రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామంలో ధ్వంసమైన రోడ్లను పూర్తిస్థాయిలో పునరుద్ధరణ పనులు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షం కారణంగా గ్రామంలో ప్రజలు జాగ్రత్తలు పాటించి శిథిలావస్థకు చేరిన ఇంటిలో నివసించకుండా సురక్షిత ప్రాంతాలలో నివసించాలని సూచించారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

**నవతెలంగాణ-బోధన్**

మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో సోమవారం భారీ వర్షాల కారణంగా షేక్ సిరాజుద్దీన్‌కు చెందిన నివాస గృహం కూలిపోయింది. దాంతో నిరుపేద కుటుంబం సమాచారం తెలుసుకున్న లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరిశీలించి 50 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. అలాగే ఎంపీడీఓ గంగాధర్ కూలిపోయిన ఇంటిని పరిశీలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ప్రతినిధులు బసవేశ్వరరావు, శ్రీనివాసరావు, షిండే, కాంగ్రెస్ నాయకులు నాగేశ్వరరావు, టప్పా సాయిలు పాల్గొన్నారు.

## గ్రామాలను సందర్శించిన కాంగ్రెస్ నాయకులు

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

గత 2, 3 రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాలలో కూలిపోయిన ఇళ్లను సోమవారం నాడు స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా పరిశీలించారు. మండల పరిధిలోని భిక్కనూరు గ్రామంలో బ్యాటరీ అంతయ్య, చాకలి లక్ష్మి, సంగమేశ్వర్‌కు చెందిన కూలిపోయిన ఇళ్లను పరిశీలించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సహాయం అందించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వర్షాల నేపథ్యంలో అత్యవసర పరిస్థితి ఉన్నట్లు యితే మదన్ మోహన్ రావు హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయాలని, సమీపంలోని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ సభ్యులు సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు.

## ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**నవతెలంగాణ-బోధన్**

మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన నిరుపేద వికలాంగురాలి కుటుంబానికి జనసేన పార్టీ నాయకులు సోమవారం నిత్యావసర సరకులను అందించారు. భారీ వర్షాల కారణంగా వారి నివాసంలో నీరుచేరి శిథిలావస్థకు చేరడంతో వారిని తహసీల్దార్ విఠల్ పంచాయతీ కార్యాలయంలో వారికి ఆశ్రయం కల్పించారు. దాంతో ఆ నిరుపేదలకు జనసేన ఆధ్వర్యంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా నిత్యావసర సరకులను అందించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జనసేన పార్టీ బోధన్ అధ్యక్షులు పవన్ శివ, ఉపాధ్యక్షులు రమేష్ దాస్, ప్రధాన కార్యదర్శి టి.బాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజ్, కార్మిక విభాగం అధ్యక్షులు వేణు, సోషల్ మీడియా కన్వీనర్ షేక్ మొహమ్మద్, కృష్ణ, అనిల్, షాదుల్, వరుణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## వైఎస్సార్ వర్ధంతి.. పలువురు నివాళి

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

**భిక్కనూర్ :** భిక్కనూర్ పట్టణ కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు లింబాద్రి, ఆంజనేయులు, రాంచంద్రం, నాయకులు పాల్గొన్నారు.

**దోమకొండ :** మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు అనంతరెడ్డి, మాజీ జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, నాయకుల ఆధ్వర్యంలో మాజీ సీఎం వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె రామ స్వామిగౌడ్, సీతారాం మధు, సీతారాం ప్రసాద్, నల్లపు శ్రీనివాస్, అబ్రబోయిన స్వామి, బాపురెడ్డి, షమ్మీ, నహీమ్, సిద్దరెడ్డి, పూలబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**కామారెడ్డి :** మాచారెడ్డి మండల కేంద్రంలో మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని మాచారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మాలోత్ నౌసిలాల్ నాయక్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు రైతులకు అండగా నిలిచిన నాయకుడు వైయస్ రాజశేఖర్‌రెడ్డి అని అన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడుతూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సలదారులు మాజీ మంత్రి షబ్బీర్ అలీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు గ్రామంలో కష్టపడి పనిచేసి స్థానిక సంస్థల్లో విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నునావత్ గణేష్ నాయక్, యూత్ అధ్యక్షులు రాజిరెడ్డి, గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, అలీఖాన్, ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు బద్రి శ్రీనివాస్ చారి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అధికారిని కలిసిన సహా చట్టం ప్రతినిధులు

**నవతెలంగాణ-కామారెడ్డి**

నూతనంగా బాధ్యతలు తీసుకున్న కామారెడ్డి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.సుదర్శన్‌ను ఆయన కార్యాలయంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఎ సలీం, జిల్లా ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరు డిఆర్‌డిఓ పిడికి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ ఎంఎ సలీంతో పాటు కామారెడ్డి జిల్లా మహిళా కార్యదర్శి ఎస్.జమున, ఎస్.కె షాహినా, షేక్ ఇర్ఫాన్, కామారెడ్డి పట్టణ కార్యదర్శి ఎం.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## తగిలేపల్లిలో సీఎం రిలీఫ్ చెక్కులు పంపిణీ

**నవతెలంగాణ-వర్ని**

మండలంలోని తగిలేపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇద్దరు లబ్దిదారులకు సీఎం రిలీఫ్ చెక్కులను మొబైల్ శ్రీనివాస్, కొత్త రాములు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లం సాయిలు, బక్క శంకర్, మహేష్, తొంట శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకునేవిధంగా చర్యలు

- జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్

**నవతెలంగాణ-భిక్కనూర్**

పంట నష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకునే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. భిక్కనూర్ మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండి అలుగు వెళ్లడం కారణంగా చెరువుల సమీపంలోని పంటలు పూర్తిస్థాయిలో నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ నష్టం జరిగిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎవో మాట్లాడుతూ రామేశ్వర్‌పల్లి గ్రామంలో అపార చెరువు సమీపంలోని 10మంది రైతులకు చెందిన 42 ఎకరాలు, ఎడ్ల కట్ట వాగు సమీపంలోని సుమారు 30 ఎకరాల వరి పంట నష్టం జరిగిందని తెలిపారు. అలాగే గ్రామాలలో కొనసాగుతున్న ఫ్యామిలీ గ్రూపింగ్ వివరాలు పరిశీలించారు. ఈ పంట పరిశీలనలో మండల వ్యవసాయ అధికారి రాధా, ఏఈఓ మౌనిక రైతులున్నారు.


నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

# ప్రజలు బయటకు రావొద్దు

- జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

**నవతెలంగాణ-కామారెడ్డి**

అధిక వర్షాల ప్రభావం జిల్లాలో కొనసాగుతున్నందున జిల్లాలోని ప్రజలు అత్యవసరం అనుకుంటే తప్ప బయటకు రాకూడదని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ సోమవారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. జిల్లాలో వరుసగా కురుస్తున్న వర్షాల ప్రభావం వలన అక్కడక్కడ రహదారులు దెబ్బతిన్నాయని ప్రజలు బయటకు వస్తే ఇబ్బంది పడతారని అన్నారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని, చెరువులు, కుంటలు తదితర అన్ని రకాలుగా నీటి వనరులు పూర్తిగా నిండి ఉన్నాయని ప్రజలు అత్యవసరం అనుకుంటే తప్ప బయటకు రావద్దని సూచించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి జిల్లాలోని లో లెవెల్ వంతెనలు, కాజ్వేలను పరిశీలించి వాటి పైనుంచి నీరు ప్రవహించే వాటి వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనదారులు ప్రయాణించకుండా పోలీస్ శాఖ వారు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామాల రహదారులలో కూడా నిఘా ఉంచాలని అన్నారు. మత్స్యకారులు, యువకులు చేపలు పట్టడానికి చెరువులు, వాగులు, వంకలు వద్దకు వెళ్ళవద్దని, చిన్నారులు ఈత కొట్టడానికి నీటి వనరుల వద్దకు వెళ్లవద్దని సూచించారు. రైతులు ప్రమాదకరమైన వాగులు, వంకలు దాటి పొలాల వైపు వెళ్ళరాదని, పశువుల కాపర్లు కూడా పశువులను తీసుకొని బయటకు వెళ్ళరాదని సూచించారు. కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలు వాటి పరిసరాల్లోకి వెళ్లవద్దని, పాత భవనాల వద్దకు వెళ్లరాదని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో ప్రజలకు పేర్కొన్నారు.

## కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన ఆర్డీవో

**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆర్డీవో మన్నె ప్రభాకర్ సోమవారం తనిఖీ చేశారు. గత 2 రోజులుగా కురుస్తున్న వర్షా లకు పాఠశాల ఆవరణలో చెరువును తలపించేలా నిలిచిన నీటిని పరిశీలించారు. ఆవరణలో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం హాస్టల్ రికార్డులను పరిశీలి ంచారు. విద్యార్థులకు వర్షాలు నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా చూడాలని, మంచి ఆహారం అందించాలని, ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీ హరి రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు అల్లం శ్రీను, నీలకంఠం, శ్రీనివాస్, పోచయ్య పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిపాల్గొన్నారు.

## మండల అభివృద్ధికి సహకరించాలి

**నవతెలంగాణ-రామారెడ్డి**

మండలాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్‌ను జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి కోరారు. మహేష్ కుమార్‌గౌడ్ కార్యాలయంలో సోమవారం మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రతి లబ్దిదారునికి అందే కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని, ప్రభుత్వ పాఠశాలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరినట్లు మోహన్ రెడ్డి తెలిపారు.